

‘పల్లె’వించిన కట్టుబాటు

తుగ్గలి మండలంలోని హుసేనాపురం, ఆర్. కొట్టాల గ్రామాల్లోకి ఎవరూ మద్యం బాటిళ్లు, సారా తీసుకు రావడం లేదు. ఆ కట్టుబాటు ఇప్పటికీ ఆనవాయితీగా కొనసాగుతోంది. 8లో ▸



మల్లన్నకు నృత్య నీరాజనం

శ్రీశైలంటెంపుల్: నిత్యకళా వేదికపై ఆదివారం మహబూబ్‌నగర్ జిల్లా జడ్చర్లకు చెందిన కూచిపూడి కళాక్షేత్రం వారి సంప్రదాయ నృత్యప్రదర్శన భక్తులను ఆకట్టుకుంది.



టీబీ డ్యాం సమాచారం

పూర్తి మట్టం	:1,633 అడుగులు
ప్రస్తుతం	:1,625.69
టీఎంసీల సామర్థ్యం	:105.788
ప్రస్తుతం	:78.770
ఇన్‌ఫ్లో (క్యూసెక్కులు)	:36,014
ఔట్‌ఫ్లో (క్యూసెక్కులు)	:17,952

న్యూస్‌రీల్

ఉరుకుందలో ముగిసిన శ్రావణమాస ఉత్సవాలు



ఎల్‌ఎల్‌సీలో పూజలు చేస్తున్న దృశ్యం

కౌతాళం: ఉరుకుంద ఈరన్నస్వామి శ్రావణ మాస ఉత్సవాలు ఆదివారం ముగిశాయి. ఆలయ డిప్యూటీ కమిషనర్ వాణి ఆధ్వర్యంలో ధ్వజస్తంభం వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం తుంగభద్ర దిగువ కాలువ (ఎల్లెల్సీ)కు వెళ్లి గంగ పూజ నిర్వహించి హారతిని వదిలారు. దేవాలయ ప్రధాన అర్చకుడు ఈరప్పస్వామి, ఉప ప్రధాన అర్చకుడు మహదేవస్వామి, వేద పండితుడు మురళీకృష్ణ, ఆలయ ఇన్‌స్పెక్టర్ వీరేష్ పాల్గొన్నారు.

ఆరు మండలాల్లో తేలికపాటి వర్షం

కర్నూలు(అగ్రికల్చర్): జిల్లాలోని శనివారం నుంచి ఆదివారం ఉదయం వరకు ఆరు మండలాల్లో తేలికపాటి వర్షం కురిసింది. ఎమ్మిగనూరులో 20 , గోనెగండ్లలో 12.6, గూడూరులో 6.6, కోడుమూరులో 5.8,, పెద్దకడుబూరులో 4.6, కౌతాళంలో 4 మి.మీ. ప్రకారం వర్షాలు కురిశాయి. జిల్లా మొత్తంగా సగటున 2.1 మి.మీ. వర్షపాతం నమోదైంది. ఆగస్టు నెల సాధారణ వర్షపాతం 116.2 మి.మీ. ఉండగా... ఇప్పటి వరకు 186.1 మి.మీ. వర్షపాతం నమోదైంది. రానున్న రెండు, మూడు రోజుల్లో ఒకటి, రెండు చోట్ల తేలికపాటి నుంచి ఒక మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ అధికారులు తెలిపారు.

జిల్లాల సరిహద్దుల మార్పులపై 29న సలహాల స్వీకరణ

కర్నూలు(సెంట్రల్): రాష్ట్ర ప్రభుత్వం త్వరలో మార్పులు చేయనున్న జిల్లాలు, మండలాలు, గ్రామాల సరిహద్దుల మార్పుపై ప్రజల నుంచి సలహాలు, సూచనలు, అభ్యంతరాలు తెలిపేందుకు 29వ తేదీన మంత్రుల బృందం పర్యటించనున్నట్లు కలెక్టర్ పి.రంజిత్‌బాషా ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. కలెక్టరేట్‌లోని సునయన ఆడిటోరియంలో ఉదయం 10 నుంచి 12 గంటల వరకు జిల్లా ఇన్‌చార్జి మంత్రి నిమ్మల రామానాయుడు, ఆరోగ్యశాఖమంత్రి సత్యకుమార్ హాజరై ప్రజల నుంచి వినతులను స్వీకరిస్తున్నట్లు చెప్పారు. ఉమ్మడి జిల్లా ప్రజలు, ప్రజాప్రతిప్రతినిధులు హాజరై తమ అభ్యంతరాలు, సలహాలు, సూచనలు ఇవ్వవచ్చని సూచించారు.

నీటి తొట్టికి టీడీపీ రంగు



రామకొండలో పశువుల నీటితొట్టికి వేసిన పసుపు రంగు

తుగ్గలి: కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత రాష్ట్రంలో పలుచోట్ల ఆ పార్టీ శ్రేణులు ప్రభుత్వ కార్యాలయాలు, భవనాలకు పచ్చరంగు వేసి తమ వికృత చేష్టలను బయట పెట్టుకున్నారు. దాన్ని అనుసరించి తుగ్గలి మండలం రామకొండలో ఉపాధి హామీ నిధులు రూ.38వేలతో నిర్మించిన పశువుల నీటి తొట్టికి సైతం పసుపు రంగు వేశారు. దీనిని చూసి టీడీపీ నాయకులు మురిసి పోతుండగా..ప్రజలు మాత్రం విస్తుపోతున్నారు.

బైక్‌ను ఢీకొన్న కారు

- ఇద్దరి పరిస్థితి విషమం



నుజ్జు అయిన కారు

ఎమ్మిగనూరురూరల్: బనవాసిఫారం విద్యుత్ సబ్‌స్టేషన్ సమీపంలో ఆదివారం రాత్రి మోటార్ సైకిల్‌ను కారు ఢీ కొట్టింది. ఈ ఘటనలో ఇద్దరు వ్యక్తులకు తీవ్ర గాయాలయ్యాయి. మంత్రాలయానికి చెందిన రాజేష్, మాబు ఆదోని నుంచి మోటార్ బైక్‌పై తమ ఊరికి వెళ్తున్నారు. ఫారం సబ్ స్టేషన్ సమీపంలో ఎదురుగా వేగంగా వస్తున్న కారు ఢీ కొనటంతో బైక్‌పై ఉన్న ఇద్దరు వ్యక్తులు ఎగిరి కిందపడటంతో తీవ్ర గాయాలయ్యాయి. ప్రమాదంలో కారు నుజ్జు అయ్యింది. గాయపడిన వారిని 108లో ప్రభుత్వాసుపత్రికి తరలించగా పరిస్థితి విషమంగా ఉండటంతో కర్నూలు ప్రభుత్వాసుపత్రికి రెఫర్ చేశారు.

పెద్దాసుపత్రికి సుస్తీ!

- నాలుగు ఆపరేషన్ థియేటర్లు మూత
- ఆరు నెలలుగా కొనసాగుతున్న మరమ్మతులు
- సగానికి పైగా తగ్గిన శస్త్రచికిత్సలు
- వాయిదా పడుతున్న ఆపరేషన్లు
- ఇబ్బందులు ఎదుర్కొంటున్న రోగులు

మంచి డాక్టర్లు ఉంటారని సుదూర ప్రాంతాల నుంచి కర్నూలు పెద్దాసుపత్రికి రోగులు వస్తుంటారు. ఇక్కడికి వచ్చాక వారికి అసలు విషయం తెలుస్తోంది. అన్నీ సమస్యలేనని, సకాలంలో వైద్యం అందదని, ఆపరేషన్లు చేయడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక నిధులు విడుదల చేయకపోవడంతో ఆసుపత్రిలో మరమ్మతులు నిలిచిపోయాయి. ఆపరేషన్ థియేటర్లు పనిచేయడం లేదు. దీంతో శస్త్రచికిత్సలు వాయిదా పడుతూ వస్తున్నాయి.



మూతపడిన న్యూరోసర్జరీ ఆపరేషన్ థియేటర్



ఆపరేషన్ కోసం ఎదురుచూస్తున్న రోగులు

కర్నూలు(హాస్పిటల్): కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాలలోని సూపర్‌స్పెషాలిటీ భవనం పాతికేళ్ల క్రితం నిర్మించారు. దానిపై కొన్నేళ్ల క్రితం ఓ ప్రజాప్రతినిధి సోలార్ ప్యానెళ్లు అమర్చి వ్యాపారాన్ని చేసుకున్నాడు. వ్యాపారమైతే చేసుకున్నాడు గానీ సోలార్ ప్యానెళ్లు అమర్చడంలో నిర్లక్ష్యం వహించాడు. దీంతో ఆసుపత్రికి పెద్ద నష్టమే ఏర్పడింది. సోలార్ ప్యానెళ్లను ఆసుపత్రి భవనంపై నేరుగా డ్రిల్లింగ్ చేసి ఏర్పాటు చేశారు. దీంతో డ్రిల్లింగ్ చేసిన చోట చిన్న చిన్న రంధ్రాల ద్వారా వర్షపు నీరు భవనంలోకి లీకై పై అంతస్తులో ఉన్న న్యూరోసర్జరీ, యురాలజీ, నెఫ్రాలజీ, సీటీ సర్జరీ విభాగాలకు మాడ్యులర్ ఆపరేషన్ థియేటర్లతో పాటు కేథలాబ్ యూనిట్ కూడా దెబ్బతింది. ఈ కారణంగా ఆరు నెలలకు పైగా కేథలాబ్ యూనిట్‌లో సేవలు ఆగిపోయాయి. దానికి మరమ్మతులు చేసిన అనంతరం సేవలు పునఃప్రారంభమయ్యాయి. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం(2023–24)లో వివిధ రకాల పనులు, ఆపరేషన్ థియేటర్ల మరమ్మతులకు రూ.3కోట్లు నిధులు మంజూరు చేసింది. ఇందుకు సంబంధించి పలు మార్లు టెండర్ పిలిచినా ఎన్నికలు సమీపించడంతో కాంట్రాక్టర్లు ఎవ్వరూ ముందుకు రాలేదు. దీంతో ఈ యేడాది జనవరిలో మళ్లీ టెండర్ పిలవడంతో ఓ కాంట్రాక్టర్ ముందుకు వచ్చాడు. ఏడు నెలల నుంచి న్యూరోసర్జరీ, యురాలజీ, నెఫ్రాలజీ విభాగాలకు సంబంధించిన థియేటర్లలో ఆపరేషన్లు జరుగుతున్నాయి.

అధికారుల మధ్య వాగ్వాదం

ఆపరేషన్ థియేటర్ మరమ్మతులకు సంబంధించిన పనుల విషయమై ఇటీవల ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ కె.వెంకటేశ్వర్లు, ఏపీఎంఎస్ఐడీసీ ఈఈ చిరంజీవులు మధ్య వాగ్వాదం జరిగింది. పనులు చాలా ఆలస్యంగా జరుగుతున్నాయని, నాణ్యత ఉండటం లేదని ఆసుపత్రి అధికారులు చెప్పడంతో ఇంజినీరింగ్ అధికారులు మనస్తాపం చెందారు. నాణ్యత, పనుల వేగం గురించి తాము చూసుకుంటున్నామని, తమను నిందించాల్సిన పనిలేదని, ఏకవచనంతో సంబోధిస్తే ఎలాగంటూ ఈఈ అక్కడి నుంచి వెళ్లిపోయిన విషయం విదితమే. కూటమి ప్రభుత్వం సకాలంలో నిధులు ఇవ్వకపోతే అధికారులైనా ఏమి చేస్తారని వైద్యులు చర్చించుకుంటున్నారు.

నత్తనడకన మరమ్మతులు

ఆసుపత్రిలోని న్యూరోసర్జరీ, యురాలజీ, నెఫ్రాలజీ, సీటీ సర్జరీ ఆపరేషన్ థియేటర్లల మరమ్మతులు, ఇతర పనులకు ఈ యేడాది జనవరిలో రూ.1.50 కోట్లతో టెండర్లు పిలిచారు. ఈ మేరకు టెండర్ దక్కించుకున్న కాంట్రాక్టర్ పనులు నత్తనడకన చేస్తున్నాడు. ఆరు నెలలుగా ఇందుకు సంబంధించిన పనులు జరుగుతూనే ఉన్నాయి. అతను చేసిన పనులకు ప్రభుత్వం నుంచి బిల్లులు సరిగ్గా రాకపోవడంతో ఇటీవల కాలంలో ఆ పనులు కూడా ఆపేసినట్లు సమాచారం. దీంతో ఆపరేషన్ థియేటర్ పనులు ఎప్పుడు పూర్తవుతాయో అధికారులే చెప్పలేని పరిస్థితి నెలకొంది.

సగానికిపైగా తగ్గిపోయిన ఆపరేషన్లు

యురాలజీ విభాగంలో 2024 జనవరి నుంచి ఈ యేడాది జనవరి వరకు మేజర్ సర్జరీలు 1,064, మైనర్ 1,352 సర్జరీలు జరిగాయి. ఆ తర్వాత ఫిబ్రవరి నుంచి ఈ నెల 21వ తేది వరకు మేజర్ 571, మైనర్ 700 సర్జరీలు మాత్రమే నిర్వహించారు. అలాగే న్యూరో సర్జరీలో గత సంవత్సరం జనవరి నుంచి ఈ యేడాది జనవరి వరకు మేజర్ 832, మైనర్ 85 సర్జరీలు నిర్వహించారు. గత ఫిబ్రవరి నుంచి ఈ నెల 21వ తేది వరకు మేజర్ 427, మైనర్ సర్జరీలు అసలే చేయలేదు. అత్యవసరం ఉన్న రోగుల కేసులు, తీవ్రమైన పరిస్థితులు ఉన్న వారి ఆపరేషన్లు మాత్రమే నిర్వహిస్తున్నారు.

ఇతర థియేటర్లలో ఆపరేషన్లు

సూపర్‌స్పెషాలిటీ విభాగంలో ఉన్న నాలుగు ఆపరేషన్ థియేటర్లు ఆరు నెలలుగా మూతపడటంతో అక్కడి విభాగాల వైద్యులు ఎంసీహెచ్(మాతాశిశు భవనం), శుశృత భవనాల్లో ఉన్న ఆపరేషన్ థియేటర్లలో ఆపరేషన్ చేస్తున్నారు. కాగా ఈ ఆపరేషన్ థియేటర్లు గైనకాలజీ, పీడియాట్రిక్ సర్జరీ, ప్లాస్టిక్ సర్జరీ, ఈఎన్‌టీ, ఆర్థోపెడిక్ విభాగాలకు చెందినవి. ఆయా విభాగాలు ఆపరేషన్లు పూర్తి చేసుకున్నాక మాత్రమే సూపర్‌స్పెషాలిటీ విభాగాల వైద్యులు ఆపరేషన్లు చేసుకోవాల్సి వస్తోంది. దీంతో గతంతో పోలిస్తే సగం కూడా ఆపరేషన్లు కావడంతో లేదు. ఈ కారణంగా ఆయా విభాగాల్లోని రోగులకు ఆపరేషన్లు వాయిదా పడుతూ వస్తున్నాయి. కేవలం అత్యవసర, తీవ్రమైన ఆరోగ్య పరిస్థితులు ఉన్న రోగులకు మాత్రమే ఆపరేషన్లు నిర్వహిస్తూ మిగిలిన వారికి తర్వాత రావాలని వైద్యులు వెనక్కి పంపిస్తున్నారు.

చర్యలు తీసుకుంటున్నాం



ఆసుపత్రిలో నిర్వహణ పనుల్లో భాగంగా ఆపరేషన్ థియేటర్ల మరమ్మతులు కూడా ఉన్నాయి. పలు కారణాలతో పనులు ఆలస్యమైన మాట వాస్తవమే. సాధ్యమైనంత త్వరగా వాటిని పూర్తి చేసి రోగులకు సేవలు అందుబాటులోకి తీసుకొచ్చేందుకు చర్యలు తీసుకుంటున్నాం.

–చిరంజీవులు, ఏపీఎంఎస్ఐడీసీ, ఈఈ, కర్నూలు

శ్రీశైలం.. భక్తజన సంద్రం



క్యూలైన్లలో బారులు తీరిన భక్తులు

శ్రీశైలంటెంపుల్: శ్రీశైల మహాక్షేత్రంలో వెలసిన శ్రీభ్రమరాంబా మల్లికార్జున స్వామిఅమ్మవార్ల దర్శనానికి భక్తులు పోటెత్తారు. ఆదివారం సెలవు రోజు కావడంతో స్వామిఅమ్మవార్లను దర్శించుకునేందుకు ఉభయ తెలుగు రాష్ట్రాల నుంచే కాకుండా ఇతర రాష్ట్రాల నుంచి భక్తులు భారీగా తరలివచ్చారు. వేకువజాము నుంచే పాతాళగంగలో పుణ్యస్నానాలు ఆచరించి క్యూలైన్ వద్దకు చేరుకున్నారు. ఉచిత, శీఘ్ర, అతిశీఘ్ర దర్శన క్యూలైన్ల ద్వారా భక్తులు స్వామిఅమ్మవార్లను దర్శించుకున్నారు. మూడు విడతలుగా మల్లన్న స్పర్శదర్శనాన్ని నిర్వహించారు. భక్తుల శివనామస్మరణతో ఆలయ ప్రాంగణం మారుమోగింది. భక్తుల రద్దీతో క్షేత్ర పురవీధులన్నీ కిటకిటలాడాయి.



మట్టి వినాయకులనే పూజిద్దాం



పూజకు సిద్ధంగా ఉన్న మట్టి వినాయకులు

మంత్రాలయం రూరల్ : వినాయక చవితి సందర్భంగా ప్రతి ఒక్కరూ మట్టి వినాయకులను పూజించాలని మంచాలమ్మ ఆలయ పూజారి రాఘవేంద్రగౌడ్ పిలుపు నిచ్చారు. ఆదివారం మండల కేంద్రంలోని వినాయక ఉత్సవాలకు మట్టి వినాయక విగ్రహాలు తయారు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మంత్రాలయంలోని పాత ఊరిలో శ్రీ ఆంజనేయస్వామి దేవాస్థానంలో శ్రీమఠం పీఠాధిపతి సుబుధేంద్ర తీర్థుల స్వాముల చేతుల మీదుగా ఉచిత పంపిణీ కార్యక్రమం ఉంటుందన్నారు. మట్టి వినాయక విగ్రహాలు కావాల్సిన వారు ఫోన్ నెంబర్ 84988 32149 సంప్రదించాలన్నారు.

బెలుం గుహల సందర్శనకు అంతరాయం

- పలు ప్రాంతాల్లో పేరుకుపోయిన బురద

కొలిమిగుండ్ల: ప్రపంచ ప్రఖ్యాతి గాంచిన బెలుం గుహలను అందాలను తిలకించేందుకు వచ్చే పర్యాటకులకు అంతరాయం ఏర్పడుతుంది. ఇటీవల కురిసిన భారీ వర్షాలకు పెద్ద ఎత్తున వరదనీరు ప్రవహించడంతో లోపల పలు భాగాల్లో బురద పేరుకు పోయింది. గుహలోపల పర్యాటకులను ప్రధానంగా ఆకట్టుకునే పాతాళగంగ, కోటి లింగాలు తదితర ప్రాంతాలకు పోయేందుకు వీలు లేకుండా పోయింది. ఎక్కువ భాగం బురద నిల్వ ఉండటంతో ఆప్రాంతాలను వీక్షించేందుకు యాత్రికులకు అవకాశం లేకుండా పోయింది. బురద ఉన్న చోట సిబ్బంది అక్కడక్కడ బండరాళ్లు ఏర్పాటు చేసినా ఇబ్బందిగా మారుతోంది. పర్యాటకులు గుహ లోపల ముఖ్యమైన ప్రాంతాలు తిలకించే అవకాశం లేకుండా పోవడంతో నిరుత్సాహ పడుతున్నారు.

‘హద్దు’లు దాటిన టీడీపీ నేత కబ్జా



పట్టణంలోని మైనారిటీ కాలనీ వద్ద కబ్జా చేసిన మున్సిపాలిటీకి చెందిన స్థలం

- ఎమ్మిగనూరులో 92 సెంట్ల భూమి ఆక్రమణ
- సర్వే నంబర్ మార్చి మ్యాప్‌పైనే ప్లాట్ల విక్రయాలు
- మున్సిపల్ అధికారులకు మామూళ్లు ఇచ్చినట్లు ప్రచారం
- మున్సిపల్ భూమి అంటూ ఏర్పాటు చేసిన బోర్డు తొలగింపు

ఎమ్మిగనూరుటౌన్: అధికారంలో ఉన్నాం కదా ఏదైనా ఆక్రమించవచ్చు.. ఏమైనా చేయొచ్చు.. ఆక్రమించిన దాన్ని ప్లాట్లు వేయకుండానే స్కెచ్ ప్లాన్ మీదే విక్రయించవచ్చు అనుకున్నాడు ఓ టీడీపీ నాయకుడు. స్థానిక ఎమ్మెల్యే సైతం తనకు అండగా ఉన్నాడు అంటూ మున్సిపాలిటీకి చెందిన ఖాళీ స్థలాన్ని కబ్జా చేశారు. అందులో రాళ్లు పాతించకుండా పేపర్లలో ప్లాట్ల నంబర్లు వేసి విక్రయించాడు. కబ్జా చేసిన భూమి ఎమ్మిగనూరు పట్టణంలోని మైనారిటీ కాలనీ వద్ద మున్సిపాలిటీకి చెందిన ఖాళీ స్థలం.

కబ్జా ఇలా..

మైనారిటీ కాలనీలోని సర్వే నంబర్ 157 పక్కనే తనకున్న కొద్ది భూమిలో ప్లాట్లు వేసి విక్రయించేందుకు టీడీపీ నాయకుడు వెంచర్ వేశాడు. దాని పక్కనే మున్సిపాలిటీకి చెందిన ఖాళీ స్థలం 157 డీ 2లో 92 సెంట్లు ఉంది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత ఆ భూమి కూడా తనదే అంటూ ప్లాట్లు వేసి విక్రయించేందుకు టీడీపీ నాయకుడు పన్నాగం పన్నాడు. విషయం తెలిసి మున్సిపల్ టౌన్ ప్లానింగ్ అధికారులు ఆస్థలం మున్సిపాలిటీకి చెందినదంటూ బోర్డ్ ఏర్పాటు చేశారు. అయితే తాను కబ్జా చేసిన భూమిలో వేసిన వెంచర్ వ్యవహారం కొనుగోలుదారులకు తెలుస్తుందని మున్సిపల్ అధికారులు ఏర్పాటు చేసిన బోర్డ్‌ను తొలగించేశాడు. ఇలా ఒకటి కాదు నాలుగైదు సార్లు మున్సిపల్ అధికారులు పాతిన బోర్డ్‌ను తొలగించాడు. 157 డీ2లో ఉన్నది తన భూమి అని కొనుగోలుదారులకు చెప్పి మ్యాప్‌లోని స్కెచ్‌ను చూపించాడు. అయితే ఈ భూమిని సర్వే చేయాలంటూ అధికారులు జూలై 18న తహసీల్దార్‌కు లేఖ పంపారు. అధికారులకుని టీడీపీ నాయకుడు రూ.5లక్షలు ముట్టజెప్పినట్లు పట్టణంలో ప్రచారం జరుగుతోంది. ఇప్పటికే విలువైన 92 సెంట్ల భూమిని ప్లాట్లుగా ప్లాన్ స్కెచ్‌లో విభజించి అమ్మేశాడు.

అధికారులపై ఒత్తిళ్లు

కబ్జా చేసిన 92 సెంట్ల భూమిపై ఎలాంటి చర్యలకు ఉపక్రమించకుండా చూడండి అంటూ టీడీపీ నాయకుడు ప్రతి రోజూ మున్సిపల్ అధికారులపై ఒత్తిడి తెస్తున్నాడు. మైనారిటీ కాలనీ వాసుల కోసం 92 సెంట్ల భూమిని మున్సిపల్ అధికారులు రిజర్వ్ చేశారు. అయితే ఆ స్థలాన్ని కబ్జా చేసి విక్రయించినా, ఆక్రమిత భూమిలో పెట్టిన బోర్డ్‌ను తొలగిస్తున్నా టీడీపీ నాయకుడిపై ఎలాంటి చర్యలు తీసుకోకపోవడం పట్ల కాలనీ వాసులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ముమ్ముందు మరిన్ని భూ కబ్జాలు సాగే విధంగా అధికారులే కల్పిస్తున్నారన్న అనుమానాలను పట్టణ ప్రజలు వ్యక్తం చేస్తున్నారు.

చట్టపరంగా చర్యలు తప్పవు

మున్సిపల్ ఖాళీ స్థలాలపై సర్వే చేయించి వాటికి శాశ్వత హద్దులు ఏర్పాటు చేశాం. ఆయా స్థలాలను పరిరక్షిస్తాం. మైనారిటీ కాలనీ వద్ద భూకబ్జా చేసిన అంశంపై సర్వే చేయించి తగిన చర్యలు తీసుకొంటాం. స్థలాలను ఆక్రమిస్తే చట్టపరంగా చర్యలు తప్పవు.

– గంగిరెడ్డి, మున్సిపల్ కమిషనర్, ఎమ్మిగనూరు


పింఛన్ పోయిందని దివ్యాంగునికి గుండెపోటు



అచేతనంగా ఉన్న మద్దిలేటి

గోనెగండ్ల: పింఛన్ పోయిందని తెలిసి గోనెగండ్లకు చెందిన దివ్యాంగుడు బొగ్గు చిన్న మద్దిలేటికి గుండెపోటు వచ్చింది. కుటుంబ సభ్యులు ఆయనకు చికిత్స అందిస్తున్నారు. గోనెగండ్లలోని దొనబండ వీధికు చెందిన బొగ్గు చిన్నమద్దిలేటికి పుట్టకతోనే మాటలు రావు, వినపడవు. సైగలతో జీవనం సాగిస్తూ వస్తున్నారు. ఈయనకు భార్య రంగమ్మ, నాలుగేళ్ల కూతురు సౌజన్య ఉన్నారు. సదరం సర్టిఫికెట్ ఆధారంగా దివ్యాంగ పింఛన్ కొన్నేళ్ల నుంచి తీసుకుంటున్నాడు. అతని వయస్సు ప్రస్తుతం 57 ఏళ్లు. ఇటీవల ప్రభుత్వం నిర్వహించిన సదరం క్యాంపులో మద్దిలేటికి 40 శాతం వికలత్వం ఉందని పింఛన్ రాదని అధికారులు నోటీసు ఇచ్చారు. దీంతో గుండెపోటు వచ్చి మద్దిలేటి స్పృహ కోల్పోయాడు. ఇంటి వద్దే అచేతనంగా ఉన్న అతన్ని గమనించిన చుట్టు పక్కల వారు చికిత్స నిమిత్తం ఎమ్మిగనూరుకు తీసుకెళ్లారు. అక్కడి నుంచి మెరుగైన వైద్యం కోసం కర్నూలు ఆస్పత్రికి తరలించారు.

డీఎస్సీలో అంతా హైడ్రామా!



కర్నూలు సిటీ: ఉమ్మడి రాష్ట్రంలో ఎన్నో డీఎస్సీల నోటిఫికేషన్ల ద్వారా ఉపాధ్యాయ పోస్టులను భర్తీ చేశారు. ప్రస్తుత కూటమి ప్రభుత్వం మోగా పేరుతో డీఎస్సీ నోటిఫికేషన్ ఇచ్చినప్పటి నుంచి హైడ్రామా నడిచింది. డీఎస్సీ పరీక్షలు నెల రోజుల పాటు నిర్వహించిన తరువాత నార్మలైజేషన్ చేయడంతో చాలా తప్పులు జరిగాయనే ఆరోపణలు వచ్చాయి. అయితే ఆ తప్పులు సరిదిద్దేందుకు సమయం పడుతుండడంతోనే తుది సెలక్షన్ జాబితాల విడుదలలో జాప్యం జరగుతోందని విద్యాశాఖ వర్గాలు చెబుతున్నాయి. ఆదివారం అర్ధరాత్రి వరకు ఉపాధ్యాయ ఉద్యోగాలకు ఎంపికైన వారి వివరాలు ఇవ్వలేదు. ఎంపికైన వారికి లెటర్లు కూడా పంపించలేదు. ఉపాధ్యాయ ఉద్యోగాలకు ఎంపికైన వారికి సోమవారం సర్టిఫికెట్లు పరిశీలన చేస్తామని తొలుత చెప్పి తరువాత వాయిదా వేశారు. అంతా హైడ్రామా నడుస్తుడటంతో డీఎస్సీలో మంచి మార్కులు, ర్యాంకులు తెచ్చుకున్న వారు ఆందోళన చెందుతున్నారు.

ఇవీ అనుమానాలు...

గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం డీఎస్సీ నోటిఫికేషన్ ఇస్తే ఆనాడు టీడీపీ పెద్దలు ఒక మాట అన్నారు. డీఎస్సీ ప్రిపరేషన్‌కు కనీసం 90 రోజులు ఉండాలని చెప్పారు. అధికారంలోకి వచ్చాక డీఎస్సీ ప్రిపరేషన్‌కు 90 రోజుల సమయం లేకుండానే నోటిఫికేషన్ ఇచ్చారు. గతంలో ఎన్నడూ లేని విధంగా నెల రోజుల పాటు ఆన్‌లైన్ విధానంలో పరీక్షలు నిర్వహించారు.

- ➡ పరీక్షలు ముగిసిన తరువాత విడుదల చేసిన కీ పై అనేక ఫిర్యాదులు వచ్చాయి. అభ్యంతరాలను తీసుకొని తుది కీ ఇచ్చారు. ఇందులోనూ అనేక తప్పులు ఉన్నాయని అభ్యర్థుల నుంచి ఆందోళనలు వచ్చాయి. దీంతో అభ్యంతరాలను స్వీకరించారు కానీ పరిష్కరించారో లేదో అర్థం కానీ పరిస్థితులు ఉన్నాయి.
- ➡ పాఠశాల విద్య శాఖ కమిషనర్ విజయరామరాజు గతంలో ఎప్పుడూ లేని విధంగా డీఎస్సీ పరీక్షలు రాసిన వారందరి మార్కులను, ర్యాంకులను ఇవ్వకుండానే ఒక్కో పోస్టుకు ఒక అభ్యర్థిని ఎంపిక చేసి సర్టిఫికేట్ వెరిఫికేషన్ చేయాలని హడావుడిగా సిబ్బందికి శిక్షణ ఇచ్చారు. దీనిపై అభ్యర్థులు కోర్టును ఆశ్రయించారు. జడ్జి ఆదేశాల మేరకు మెరిట్ లిస్టులు జారీ చేశారు.
- ➡ ఉద్యోగాలకు ఎంపికైన వారిని ఖరారు చేసి జాబితాలు ఇవ్వడంతో అదిగో...ఇదిగో అంటూ రెండు రోజులు విద్యాశాఖ ఉన్నతాధికారులు ప్రకటనలు జారీ చేస్తున్నారు. ఇంత వరకు ఎలాంటి జాబితాలు ఇవ్వక పోవడంతో అభ్యర్థులు మరింత ఆందోళన చెందతున్నారు.

స్పష్టత కరువు

ఉమ్మడి కర్నూలు జిల్లాలో 2,645 పోస్టుల భర్తీకి డీఎస్సీ నోటిఫికేషన్ ఇచ్చారు. దీంతో తెలంగాణలోని కరీంనగర్, ఆదిలాబాద్, నిజామాబాద్, వరంగల్, హైదరాబాద్, మేడ్చల్, ఉత్తరాంధ్రలోని శ్రీకాకుళం, మాన్యం, పార్వతీపురం, విజయనగరం, నెల్లూరు, గుంటూరు జిల్లాలకు చెందిన వారు నాన్‌లోకల్‌లో దరఖాస్తు చేశారు. వారు అత్యధిక మార్కులు సాధించారు. ఉమ్మడి జిల్లా నుంచి ఎంత మంది దరఖాస్తు చేశారు? ఏపి క్యాటగిరీకి ఎన్ని దరఖాస్తులు వచ్చాయో కూడా ఇంత వరకు విద్యాశాఖ దగ్గర వివరాలు లేవు. ఇదేంటని అడిగిన వారికి రాష్ట్ర స్థాయి నుంచి ఆదేశం వచ్చిందని చెబుతున్నారు. ఇప్పటి వరకు వివరాలను ప్రకటించకపోవడంతో అనేక అనుమానాలు కలుగుతున్నాయి. బీసీ–డీ, బీసీ–ఈ క్యాటగిరీలకు, అన్ని క్యాటగిరీ పోస్టులకు దరఖాస్తు చేసిన అభ్యర్థులకు, చేసిన దరఖాస్తులకు, పరీక్షల తరువాత ప్రకటించిన మెరిట్ జాబితాల్లోని సంఖ్యకు తేడాలు ఉన్నట్లు సోషల్ మీడియాలో ప్రచారం జరుగుతోంది. దీనిపై జిల్లా విద్యాశాఖ అధికారులు డీఎస్సీ కన్వీనర్ దృష్టికి తీసుకపోగా..అలాంటిదేమి లేదని, పబ్లిసిటీ కోసమే అని సమాధానం ఇచ్చినట్లు తెలుస్తోంది.